క్లుప్తంగా

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



తాడూరు: మండలంలోని మేడిపూర్, యాటిదారిపల్లి, సిర్సవాడ, గ్రామాల్లో ఎంపీడీఓ ఆంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం 2 విడత ఇందిరమ్మ సర్వే చేపట్టారు. మూడు టీంలుగా ఏర్పడి సర్వే కొనసాగుతుందని ఎంపీడీఓ తెలిపారు. అర్హులైన వారిని ఇంటింటా తిరిగి ఇచ్చిన ఫార్మట్‌లో లబ్ధిదారుల వివరాలను నమోదు చేయాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 2 విడత సర్వేను చేపట్టినట్లు ఆయన తెలిపారు.

రూ.2 లక్షల విరాళం



చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రాస్వామి దేవాలయ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు కాయితి ఆశాదీప్ రెడ్డి రూ.2 లక్షలు విరాళంగా అందజేశారు. శుక్రవారం దేవాలయ పాలక వర్గం సభ్యులు తాండ్రలో ఆశాదీప్‌రెడ్డిని కలిసి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ మేరకు ఆలయ మేనేజర్ నిరంజన్, అర్చకులు లక్ష్మణ్ శర్మలకు చెక్కును అందజేశారు.

పాఠశాల వార్షికోత్సవానికి ఏర్పాట్లు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరు గ్రామ పాఠశాల ఏర్పాటుచేసి 70 సంవత్సరాలు అయిన సందర్భంగా రెండు రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల అల్యూమిని కమిటీ కన్వీనర్ బ్రహ్మాచారి తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. మే 1, 2వ తేదీల్లో వేడుకలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జగదీష్, కంటె నిరంజన్, నీలంరెడ్డి, నక్క వెంకటస్వామి, మహేష్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు హనుమంత్ నాయక్, మాజీ ఎంపీటీసీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

తాడూరు/వెల్దండ: ఈ నెల 27న వరంగల్‌లో బీఆర్‌ఎస్ 25 రజతోత్సవ భారీ బహిరంగ సభ నిర్వహిస్తోంది. ఈమేరకు తాడూరు మండలంలో బీఆర్‌ఎస్ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు నరేష్ నాయకులతో కలిసి వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అదేవిధంగా వెల్దండ మండలంలోని బైరాపూర్, పోతేపల్లి, గుండాల, బొల్లంపల్లి, అజిలాపూర్, తదితర గ్రామాల్లో రజతోత్సవ పోస్టర్‌ను నాయకులు తగుళ్ల కొండల్‌యాదవ్, అశోక్, వెంకటయ్య, రమేష్‌గౌడు, వెంకటయ్య, తదితరులు నాయకులు ఉన్నారు.

నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

కల్వకుర్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూభారతి పోర్టల్‌పై శనివారం పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవి, కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

వీధి నాటకాలకు విరాళం



వెల్దండ: మండలంలోని పోతేపల్లిలో రేణుక ఎల్లమ్మ నాటకానికి మునిరంగ స్వామి కళాబృందం సభ్యులకు శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు తగుళ్ల కొండల్‌యాదవ్ వ్యక్తిగతంగా రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ అంతరించి పోతున్న వీధి నాటకాలకు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మార్కండేయుడు, చిన్న సైదయ్య, గోపాల్, వెంకటయ్య ఉన్నారు.

ఏడీఈకి వినతి

కల్వకుర్తి రూరల్: పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డబుల్ బెడ్రూం లబ్ధిదారుల డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు శుక్రవారం విద్యుత్ ఏడీఈ శంకరయ్యకు వినతి పత్రం అందజేశారు. ఇళ్లలో మీటర్లు, ప్యానెల్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నాలుగు రోజులలో సమస్య పరిష్కరిస్తామని ఏడీఈ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అంజనేయులు, నరసింహ, కృష్ణవేణి, వెంకట చారి, సాయిబాబు, పద్మ, శ్రీనివాసులు, చంద్రయ్య, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన కోసం ఎదురుచూపులు



తుర్కలపల్లి వాగు

- తుర్కలపల్లి, గోకారం, చంద్రయాన్‌పల్లి గ్రామస్తులకు తప్పని తిప్పలు
- వర్షకాలంలో రాకపోకలకు అంతరాయం
- పట్టించుకోని అధికారులు, పాలకులు



రాకపోకలకు అంతరాయంగా ఉన్న వాగు

చారకొండ: మండలంలోని తుర్కలపల్లి గుండా వెళ్లే వాగుపై వంతెన నిర్మాణం కలగానే మిగులుతోంది. వాగుపై వంతెన నిర్మిస్తామని పాలకుల, ప్రజాప్రతినిధుల హామీలు నీటిమీదరాతలుగానే మిగిలిపోయాయి. బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో తుర్కలపల్లి, గోకారం, చంద్రయాన్‌పల్లి గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటపొలాలకు వెళ్లేందుకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. వర్షం పడితే రాకపోకలకు ఆయా గ్రామాలకు నిలిచిపోతాయి. వాగు అవతల తుర్కలపల్లి గ్రామానికి సంబంధించి 500 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గతేడాది వాగు ఉధృతి కారణంగా వాహన రాకపోకలు నిలిచిపోయాయి. కేఎల్‌ఐ కాల్వ పారితే సమస్య మరింత జటిలం అవుతోంది. సమస్య పరిష్కారం కోసం గ్రామస్తులు, రైతులు వాగుపై వంతెన (బ్రిడ్జి)నిర్మించాలని కొన్ని సంవత్సరాలుగా గ్రామస్తులు మొర పెట్టుకున్నా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

అంచనాలకే పరిమితం

వాగుపై వంతెనా నిర్మిస్తామని గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే హామీలు ఇస్తున్నారే తప్ప కాని ఆచరణలో అమలు కావడం లేదు. నిధులు మంజూరు కోసం అధికారులు, ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపించే వరకే పరిమితం అవుతున్నాయి. కొన్ని నెలల కిందట తుర్కలపల్లి నుంచి గోకారం వరకు బీటీ నిర్మిస్తామని, బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి ప్రొసిడింగ్‌లు విడుదల చేశారు. కాని ఇప్పటివరకు ఎలాంటి పనులు ప్రారంభం కాకపోవడం గమనార్హం.

అధికారులు దృష్టి సారించాలి



వాగు గుండా ప్రతి రోజు వందలాది మంది రాకపోకలు సాగిస్తారు. పొలాలకు వెళ్లేందుకు గ్రామస్తులు, రైతులు నీళ్లలోనే ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. అధికారులు వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలి.

– సంగెం రమేష్, రైతు తుర్కలపల్లి

వర్షం పడితే రాకపోకలు బంద్



వర్షం పడి నీరు వాగు గుండా ప్రవహిస్తే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. వ్యవసాయ పొలాలకు వెళ్లాలన్న, పశువులను, జీవాలను మేపడాని కి పడరాని పాట్లు పడుతున్నాం. ఇటీవల కేఎల్‌ఐ కాల్వ ద్వారా నీరు వాగులోకి చేరడంతో ఇబ్బందులు పడ్డాం. అధికారులు, పాలకులు సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.

– శ్రీను, తుర్కలపల్లి

నిధులు మంజూరు

మండలంలోని తుర్కలపల్లి గ్రామం సమీపంలోని వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు సీఆర్‌ఆర్ నిధులు నుంచి రూ. 4.60 కోట్లు మంజూరు అయ్యాయి. ముందుగా సంబంధిత పనులపై టెండర్ సంబంధిత ప్రక్రియ కొనసాగుతోంది. టెండర్ పూర్తి అయిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

– దివ్య,పిఆర్ ఏఈ, చారకొండ

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

ఉప్పునుంతల: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతోందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన అంబేద్కర్ ప్రీమియం లీగ్ క్రికెట్ పోటీల ముగింపులో ఆయన పాల్గొని మాట్లాడారు. యువతీయువకులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఫైనల్‌లో గెలుపొందిన హెచ్‌ఎం సీసీ జట్టుకు ప్రథమ బహుమతి రూ. 50 వేలు అందజేశారు. రెండో బహుమతి రూ. 40 వేలు నగదును పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రావు, నాయకులు కట్టా గోపాల్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, రవిందర్‌నాయక్, కొట్టె శ్రీను, పీఏసీఎస్ డైరెక్టర్ సాయిబాబు, కృష్ణయ్యయాదవ్, పర్వతాలు, అశోక్ రెడ్డి,ఎల్లయ్యయాదవ్, చిన్నజంగయ్య, రాజు, సుధాకర్, బాలకృష్ణ, బాలస్వామి పాల్గొన్నారు.

ప్రజల సంరక్షణ కోసం నిరంతర కృషి

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రజల సంరక్షణ కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని ఏఆర్ ఏఎస్పీ భరత్ అన్నారు. శుక్రవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో, బైక్ పార్కింగ్ పరిసరాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలను ఏఆర్ ఫోర్స్ విభాగం డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ టీమ్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

మొరాయించిన ఆర్టీసీ అద్దెబస్సు

అచ్చంపేట రూరల్: అచ్చంపేట ఆర్టీసీ డిపోకు చెందిన అద్దెబస్సు శుక్రవారం మధ్యాహ్నం పట్టణ సమీపంలో మొరాయించింది. నాగర్‌కర్నూల్ నుంచి అచ్చంపేటకు వస్తుండగా మార్గమధ్యలో పట్టణానికి రెండు కి.మీల సమీపంలో మొరాయించింది. దీంతో చేసేదేమీ లేక అందులో ఉన్న ప్రయాణికులు బస్సు దిగి మండుటెండలో కాలినడకన అచ్చంపేటకు చేరుకున్నారు.

సమయాన్ని వృథా చేయొద్దు



వెల్దండ: విద్యార్థులు వేసవిసెలవుల్లో సమయాన్ని వృథా చేయొద్దని ఎస్‌ఐ కురుమూర్తి కోరారు. శుక్రవారం వేసవి శిక్షణ వాల్‌పోస్టర్‌ను ఎస్‌ఐ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో వందేమాతరం ఫౌండేషన్, శృతి లయ కల్చరల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఎల్‌ఎల్ ప్రోగ్రామ్ వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 25 నుంచి మే 25వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. శ్రీరామ్, మల్లేష్, రవళి, శ్రీకళ, పావని, ప్రేమలత, మహేశ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన



కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్‌తండా 20 మంది ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను, తర్నికల్ గ్రామ పంచాయతీ పరిధిలో 65 మంది లబ్ధిదారుల దరఖాస్తులను శుక్రవారం ఎంపీడీఓ వెంకటరాములు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యదర్శులు సుష్మ, బాలరాజు సీనియర్ అసిస్టెంట్ ఫిరోజ్ ఖాన్, జూనియర్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

అర్హుల జాబితా పరిశీలన

చారకొండ: మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ ఇంటింటికి తిరిగి ఇందిరమ్మ ఇళ్ల జాబితాను పరిశీలించారు. లబ్ధిదారులకు నుంచి పూర్తి వివరాలను సేకరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి గణేష్ తదితరులు ఉన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

కోడేరు: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని బాడిగదిన్నెలో ఇందిరమ్మ ఇళ్ల స్థలాలను పరిశీలించారు. అనంతరం నర్సరీ, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీలత పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు సర్వే

లింగాల: మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు సర్వే నిర్వహించారు. అధికారుల బృందం ఇంటింటికి తిరిగారు.

ఉగ్రవాదుల దాడిపై నిరసన



నాగర్‌కర్నూల్‌లో అంబేద్కర్ కూడలిలో నిరసన తెలుపుతున్న ముస్లిం సంఘాల నాయకులు



అచ్చంపేట అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు



కల్వకుర్తిలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు



కొల్లాపూర్‌లో ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

సాక్షి, నెట్‌వర్క్: కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులను కాల్చిచంపిన ఉగ్రవాదులపై శుక్రవారం ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. ర్యాలీలు చేపట్టి నిరసన తెలిపారు.

- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం ప్రార్థనల అనంతరం ఉగ్రవాదుల దుశ్చర్యను నిరసిస్తూ ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేద్కర్ కూడలిలో పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.
- తిమ్మాజిపేటలోని జామా మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం గ్రామంలోని పలు వీధుల గుండా భారీ ఊరేగింపు నిర్వహించారు. పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పర్యాటకులను చంపడం దారుణమన్నారు. ఉస్మాన్, రజాక్, రవూఫ్, రఫీక్, సైఫ్,యువకులు అజ్జు, ఖాజబాబ, అమ్రోస్, ఆవేజ్, కలీమ్, కమల్ తదితరులు పాల్గొన్నారు.
- అచ్చంపేటలో ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జామె మసీదు నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.
- పెద్దకొత్తపల్లి, యాపట్ల గ్రామాల్లో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడుల్లో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. యాపట్లలో ముస్లింలు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. కలీల్, కాజ, బాబ, సుల్తాన్, మహేష్, బాలపీరు, జహంగీర్, నిరంజన్ అజీజ్ ఇమ్రాన్ పాల్గొన్నారు.
- కల్వకుర్తి పట్టణంలోని మసీదుల వద్ద ఉగ్రవాదుల దిష్టిబొమ్మలను ముస్లింలు దహనం చేశారు.
- కొల్లాపూర్ పట్టణంలోని జామె మసీద్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులను పట్టుకొని కాల్చిచంపాలని డిమాండ్ చేశారు.
- లింగాలలోని అంబట్‌పల్లి జామా మసీదులో ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.
- తిమ్మాజిపేట మండలంలోని పోతిరెడ్డిపల్లిలో నాయకులు, స్థానిక యువకులు, చిన్నారులు కొవ్వొత్తులతో వేణుగోపాలస్వామి ఆలయం నుంచి గ్రామంలోని వీధుల గుండా వెళ్తూ నివాళులర్పించారు.
- అమ్రాబాద్ మండల కేంద్రంలో ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



అచ్చంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



తాడూరులో ప్రపంచ మలేరియా దినోత్సవంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. అచ్చంపేటలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ తారాసింగ్ హాజరై మాట్లాడారు. మలేరియా నివారణే ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కొల్లాపూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మలేరియా దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ మలేరియా నిర్మూలనలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బిజినేపల్లి మండలం పాలెంలో నిర్వహించిన ర్యాలీలో పీహెచ్‌సీ వైద్యాధికారి డా. ప్రియాంక హాజరయ్యారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాడూరులో వైద్య సిబ్బంది ర్యాలీగా వెళ్లి మలేరియాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మన్ననూర్‌లో పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది సమక్షంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి జాన్సన్ మాట్లాడుతూ పాత కుండలు, టైర్లు, పాత్రలు, మురుగు గుంటలు లేకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివకుమార్, డాక్టర్ ప్రశాంత్, బిక్కులాల్, హనుమంతు, డా. సత్యలక్ష్మీ, సాయిరాం గౌడ్, డా. శ్రావణి, శ్రీనివాసులు, సుధాకర్, శ్రీవాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల పక్షాన నిరంతరం పోరాడుతాం



మాట్లాడుతున్న ఆంజనేయులు

కల్వకుర్తి రూరల్: కార్మికుల పక్షాన నిరంతర పోరాడుతామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. శుక్రవారం సీఐటీయూ వంగూరు మండల కార్యదర్శి శివరాములు అధ్యక్షతన పట్టణంలో జిల్లా సీఐటీయూ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 20న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాసమ్మ, ఆంజనేయులు, చంద్రకళ, శ్రీదేవి, సుమతి, విద్యా రాణి తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులకు వ్యక్తిగత సమాచారం చెప్పొద్దు



వెల్దండ: అపరిచితులకు వ్యక్తిగత సమాచారం చెప్పొద్దని హెడ్‌కానిస్టేబుల్ శ్యామ్‌సుందర్ పేర్కొన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే వారికి ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతానంబర్, ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పొద్దన్నారు. సైబర్ మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. బెట్టింగ్ యాప్‌లకు ఆకర్షితులై మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది వెంకట్‌రెడ్డి, మహేష్, జ్యోతి, మల్లేష్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో చిరు వ్యాపారులకు, ప్రజలకు ఆన్‌లైన్ మోసాలపై కల్వకుర్తి సీఐ నాగార్జున అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మాధవరెడ్డి, కానిస్టేబుళ్లు, చిరు వ్యాపారులు, ప్రజలు పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని సూరాపూర్‌లో గ్రామ పంచాయతీ ఆవరణలో ఎస్‌ఐ వెంకటేష్‌గౌడ్ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లతో మోసపోతే 1930కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌సీ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు పాదయాత్ర



వెల్దండ: రాజ్యాంగ పరిరక్షణకు జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ నినాదంతో శుక్రవారం మండలంలోని గాన్‌గట్టుతండాలో కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, నాయకులు పర్వత్‌రెడ్డి, శేఖర్, ఎర్రశ్రీనుముదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్ పత్యానాయక్, మహిళ నాయకురాలు రాణి తదితరులు ఉన్నారు.

జాతరను విజయవంతం చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలో బీఎస్పీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిర్వహించే మహనీయుల జాతరను విజయవంతం చేయాలని అంబేద్కర్ జాతర కమిటీ జిల్లా కార్యదర్శి వంగురు జయశంకర్ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన ఎండీ నిజామొద్దీన్, విజయ్, చంటి, సూరి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

పెంట్లవెల్లి: నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ దేవేందర్, ప్రత్యేక అధికారి విజయ్‌గౌడ్‌లు అన్నారు. ఇటీవల తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మంత్రి జూపల్లి కృష్ణారావుకు మంచాలకట్ట గ్రామస్తులు విన్నవించారు. ఈ మేరకు రూ.5 లక్షల మంజూరు చేయించారు. దీంతో గ్రామంలో బోరు డ్రిల్లింగ్ చేయడంతో నీరు పుష్కలంగా రావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. సెక్రెటరీ రాఘవేంద్ర, నిరంజన్, బాలరాజు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

తిమ్మాజిపేట: ఎరువులు, విత్తనాల దుకాణాల యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఏఓ కమల్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండలంలోని ఆయా గ్రామాల ఫర్టిలైజర్ దుకాణం యజమానులతో వ్యవసాయ అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. దుకాణంలో ఎరువులు, విత్తనాల ధరలు కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని, స్టాక్ వివరాలు నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఏఈఓలు సాయిరాం, శివ, దుకాణందారులు పాల్గొన్నారు.

ఖాళీబిందెలతో మహిళల నిరసన



చారకొండ: మండలంలోని అగ్రమారంతండాలో వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో శుక్రవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ సంబంధిత బోర్లు మరమ్మతు చేయకపోవడంతో వ్యవసాయ పొలాలకు వెళ్లి నీటికి తీసుకొస్తున్నామని వాపోయారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



కోడేరు: మండలంలోని రేకులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఒప్పితండాలో శుక్రవారం ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. ఉదయం ప్రాణప్రతిష్ఠ, బలిహరణ, జయంతిహోమం, మహాపూర్ణాహుతి, మహామంగళహారతి, తదితర పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు అర్చకులు శ్రావణ్‌కుమార్ శర్మ తెలిపారు.

మేజిస్ట్రేట్ జ్యోత్స్న బదిలీ

కొల్లాపూర్: జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మేజిస్ట్రేట్ జ్యోత్స్న గుంటి కొల్లాపూర్ నుంచి ములుగు కోర్టుకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో మంచిర్యాల కోర్టు నుంచి మేజిస్ట్రేట్ ఉషా నిషద్విని కొల్లాపూర్‌కు బదిలీపై రానున్నారు. శుక్రవారం బార్ అసోసియేషన్ న్యాయవాదులు జ్యోత్స్నను సన్మానించారు. పోతుల నాగరాజు, న్యాయవాదులు శ్రీనివాసరావు, కర్నె శ్రీహరి, భాస్కర్‌రెడ్డి, వసంతరెడ్డి, నజీరోద్దీన్, నిరంజన్, కురుమూర్తి, బాలస్వామి, రాజేష్ తదితరులు ఉన్నారు.

నేడు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఉప్పునుంతల: ఇందిర క్రాంతి పథం (ఐకేపీ)మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం మండలంలోని మామిళ్లపల్లి, పెద్దాపూర్, లక్ష్మాపూర్, కాంసానిపల్లి, తాడూరు, పెనిమిళ్ల గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తునట్లు ఐకేపీ ఏపీఎం తిర్పతయ్య, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లలితమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.